క్లుప్తంగా

డిజిటల్ బోధనపై విద్యార్థుల ఆసక్తి


డిజిటల్ విధానంలో బోధిస్తున్న హెచ్ఎం ఈశ్వరప్రసాద్

రోలుగుంట: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వం పాఠశాలల్లో డిజిటల్ బోధనను ప్రవేశ పెట్టి అమలు చేస్తోంది. దీనిపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా కొండపాలెం ఎంపీపీ పాఠశాలలో నీటి పొదుపు–మేలుపై డిజిటల్ విధానంలో సోమవారం హెచ్ఎం బోధించారు. నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీలను స్క్రీన్‌పై దృశ్య ప్రదర్శన ద్వారా ఐదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వర్షంతో రైతుల హర్షం


మాకవరపాలెంలో భారీగా కురుస్తున్న వర్షం

మాకవరపాలెం: భారీ వర్షంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మండలంలో ఐదు రోజులుగా వర్షాలు లేకపోవడం, భారీగా కాస్తున్న ఎండలతో వరి పొలాలు ఎండిపోయే స్థితికి చేరాయి. దీంతో వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి అధికంగా ఎండకాయగా, సాయంత్రం 4 గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం ప్రారంభమైంది. సుమారు గంటకు పైగా కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షం ఎండిపోతున్న పంటలకు ఊపిరి పోసిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హైస్కూల్‌కు సైన్స్ ల్యాబ్ అల్మారా వితరణ


దాతలు సురేష్, నారాయణరావులను సన్మానిస్తున్న హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: అల్లాడ జగన్నాథరావు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు అల్లాడ సురేష్, ఎస్ఆర్ఐ వెలగా సుధీర్ సంయుక్తంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ (తురకబడి)కు సైన్స్ ల్యాబ్ అల్మారాను వితరణగా అందజేశారు. పాఠశాలను దత్తత తీసుకున్న వారందరూ పేద విద్యార్థులకు తోడ్పడటంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. సైన్స్ ప్రాక్టికల్స్ పరికరాలు భద్రపరచుకునేందుకు రూ.27 వేలు విలువ చేసే ఇనుప అల్మారాను బహూకరించారు. ఈ ల్యాబ్‌ను అల్లాడ సురేష్, ఎస్ఆర్ఐ సుధీర్ తండ్రి నారాయణ, మరో దాత సుతాపల్లి శ్రావణ్ ప్రారంభించారు. హెచ్ఎం కె.వి.రమణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు దాతలను సన్మానించారు.

రోడ్డుకిరువైపులా తుప్పల తొలగింపు


తుప్పలను తొలగిస్తున్న రైతులు

కె.కోటపాడు: సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడుల ఆధ్వర్యంలో సూదివలస జంక్షన్ నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించే చర్యలను చేపట్టారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శ్రమదాన స్ఫూర్తితో కిలోమీటరు మేర రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలు, పొదలను మహిళలు, యువకులతో కలిసి తొలగించారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తొలగించినట్లు సర్పంచ్, ఎంపీటీసీ తెలిపారు. గ్రామస్తులు కిలపర్తి సత్యంనాయుడు, రంధి రామునాయుడు, గోగాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి

నర్సీపట్నం: హిందూ ధర్మ సంస్కృతుల పరిరక్షణకు భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన శౌర్య జాగరణ యాత్రలో భాగంగా ఈ నెల 11న నర్సీపట్నంలో రథయాత్రను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ ప్రతినిధి కట్టమూరి శేఖర్ తెలిపారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పెదబొడ్డేపల్లి జంక్షన్ నుంచి శివపురం, ఆంజనేయస్వామి, పాతబస్టాండ్, గచ్చపువీధి మీదగా వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంటుందన్నారు.


కె.కోటపాడు: ఆర్లిలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి రమారెడ్డి


రావికమతం: దొండపూడి వైద్య శిబిరానికి రోగుల తాకిడి


నాతవరం: వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

- కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు
- ఉచితంగా మందుల పంపిణీ

రావికమతం: దొండపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం ఇక్కడ 434 మంది రోగులను రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాస్, శ్రీరజని పరీక్షించారు. రోగుల సౌకర్యార్థం పది కౌంటర్లు ఏర్పాటు చేశారు. బీపీ, సుగర్, తదితర పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు అధిక పోషక విలువలు గల ఆహారోత్పత్తులను ప్రదర్శించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, సర్పంచ్ మరువాడ రాజులమ్మ, ఉప సర్పంచ్ గర్రెడ్డి రాజారావు పర్యవేక్షించారు.

నాతవరం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామంలోనే పేదలకు వైద్య సేవలందించేందుకు చక్కటి అవకాశమని సర్పంచులు అంకంరెడ్డి నూకాలమ్మ, మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ తెలిపారు. పెదగొలుగొండ సచివాలయంలో సోమవారం 401 మంది రోగులను వైద్యాధికారులు ఎస్, మల్లికార్జునరావు, రాజేష్‌నాయుడు, చంద్రశేఖర్ పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు, ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంకంరెడ్డి పాలురాజు, సీనియర్ నాయకుడు కరక సంజీవ్, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.


మాడుగుల రూరల్: పౌష్టికాహారం తయారీపై వివరిస్తున్న సీడీపీవో శ్రీదేవి తదితరులు

మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 311 మందికి వైద్య సేవలందించారు. వీరికి స్థానిక వైద్యులతోపాటు స్పెషలిస్టు వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. 15 మంది రోగులకు మెరుగైన చికిత్సలు అవసరమని గుర్తించారు. ఎంపీడీవో అరుణశ్రీ, ఎంఈవో మూర్తి, సచివాలయ, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు


బుచ్చెయ్యపేట: పెదమదీనలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


గొలుగొండ: పప్పుశెట్టిపాలెంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

కె.కోటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ప్రజల చెంతకే వచ్చి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు సర్పంచ్ బోళెం సందీప్ అన్నారు. ఆర్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఆర్లి, చింతపాలెం, ఎరకన్నపాలెం గ్రామాలకు చెందిన 229 మందికి ఈఎన్‌టీ, ఆర్థో, జనరల్ ఫిజీషియన్ వైద్యులు నిర్మల, రమారెడ్డి, సుబ్రహ్మణ్యం పరీక్షించి మందులు ఇచ్చారు. వ్యాధిగ్రస్తులకు సర్పంచ్ సందీప్, మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు, పీఎంసీ కమిటీ మాజీ చైర్మన్ బోలెం సత్యనారాయణ సహాయ సహకారాలందించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో శచీదేవి, పంచాయతీ కార్యదర్శి సందీప్ పర్యవేక్షించారు.

మాడుగుల: చీడికాడ మండలం అర్జునగిరిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యాధికారి శ్రీనివాసరావుతోపాటు మరో నలుగురు వైద్యాధికారులు 354 మందికి పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లు ఆకర్షణగా నిలిచాయి. ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ బి. రమాదేవి, చీడిపల్లి సర్పంచ్ కె.సూర్యనారాయణ, ఎంపీడీవో జయప్రకాష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: వేచలం పీహెచ్‌సీ పరిధిలోని వాకపల్లిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ బుగత రాజేశ్వరి ప్రారంభించారు. ఆర్థోపెడిక్, గైనకాలజిస్టు, జనరల్ వైద్యులు జాన్ దినకర్, టి.కళ్యాణి, జి. గోవిందరెడ్డి, ఇ. పూజ్య మేఘన 331 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసీజీ, బీపీ, సుగర్, రక్త పరీక్షలను చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాళ్ల ప్రదర్శించారు. ఎంపీటీసీ గొరపల్లి భాస్కరరావు, గ్రామ నాయకుడు బుగత వెంకటరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


దేవరాపల్లి: వాకపల్లిలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

మాడుగుల రూరల్: పోతనపూడిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యాధికారులు శకుంతల, లీలాప్రసాద్, సంతోష్‌కుమార్, మురళీధర్ 360 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై స్టాళ్లు ప్రదర్శించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, తహసీల్దారు పీవీ రత్నం, ఎంపీడీవో మీనాకుమారి పాల్గొన్నారు.

గొలుగొండ: పప్పుశెట్టిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో గొలుగొండ వైద్యాధికారి శ్యాంకుమార్ 250 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో వందలాది పేదలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రసాద్, పార్టీ యూత్ విభాగం మండలాధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: పెదమదీన గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష ఆదరణ లభించింది. శిబిరానికి 438 మంది హాజరు కాగా 26 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు శృతి, సంధ్యారాణి, వెంకటకృష్ణ చెప్పారు. వైస్ ఎంపీపీ దొండ లలితా నారాయణమూర్తి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కె.వెంకటరమణ, చొప్పా బాబూరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు లక్కవరం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు లక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఇటీవల మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఎంపికలో అండర్ –17 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన జి.గంగోత్రి, అండర్ –14 బాలుర విభాగంలో సిహెచ్.విజయ్ రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనడానికి అర్హత సాధించారని ఫిజికల్ డైరెక్టర్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సోమవారం ప్రధానోపాధ్యాయుడు ఓ.సీతబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి సింహాచలం నాయుడు అభినందించారు.

రూ.10 వేల సాయం అందజేత


నగదు అందిస్తున్న స్నేహాంజలి సభ్యులు

రావికమతం: వ్యాన్ ఢీకొట్టి తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కొత్తకోటకు చెందిన ప్రైవేటు టీచర్ పడమటి శ్రీనివాసరావుకు గ్రామానికి చెందిన స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు రూ.10 వేలు సోమవారం అందజేశారు. అతని తల్లి సైతం హృద్రోగ సమస్యతో బాధపడుతూ మంచం పట్టడంతో వృద్ధాప్య తండ్రి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. దీనిపై అనుకోని ప్రమాదం అంతులేని ఆవేదన శీర్షికన సాక్షిలో గత నెల 24న ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించి సహాయం అందిస్తున్నారు. స్నేహాంజలి సభ్యులు నేతల బోగేష్, పూడి నల్లయ్య, కాగిత గంగరాజు, శివప్రసాద్, పూడి అర్జున, వెల్లంకి గాంధీ, ములుకూరి బుజ్జి, పులిగా సతీష్ పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణకు అడ్డంకులు తగదు

టీడీపీ నాయకులకు తేల్చిచెప్పిన ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ముఖ ద్వారం తొలగింపునకు వాయిదాలు కోరటం సరికాదని ఆర్డీవో హెచ్.వి.జయరాం అసహనం వ్యక్తం చేశారు. ముఖ ద్వారం తొలగింపుపై సోమవారం ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ రవిబాబు ఆలయ నిర్వాహకులైన టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. అయ్యప్ప మాలలు ధరించే సమయంలో ఆలయాన్ని తొలగించటం సరికాదని, ముఖ ద్వారం తొలగించాలంటే శాస్త్రోక్తంగా కొన్ని పూజా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నందున సమయం ఇవ్వాలని టీడీపీ నాయకులు పైల గోవిందరావు, ధనిమిరెడ్డి మధు, చింతు, రాజుల నాయుడు ఆర్డీవోను కోరారు. ఇప్పటికే రెండు నెలలు సమయం ఇచ్చాం.. ఇక సమయం ఇవ్వలేమని తేల్చిచెప్పారు. రోడ్డును వందడుగులకు విస్తరిస్తున్నామని టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. అధికారులు ఎప్పుడు తొలగించినా సిద్ధంగా ఉండాలని సూచించారు. కమిషనర్‌తో తేల్చుకుంటామని టీడీపీ నాయకులు సమావేశం నుంచి లేచిపోయారు. తొలగింపు ఎప్పుడు చేపట్టినా అవసరమైన పోలీసు బందోస్తు కల్పిస్తామని ఆర్డీవో మున్సిపల్ అధికారులకు భరోసా ఇచ్చారు. తహసీల్దార్ అన్నాజీరావు, సిబ్బంది పాల్గొన్నారు.


టీడీపీ నాయకులతో సమావేశమైన ఆర్డీవో జయరాం, మున్సిపల్ అధికారులు

స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారం

ఆర్డీవో హెచ్.వి.జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆర్డీవో హెచ్.వి.జయరాం ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన)లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డివిజన్ వ్యాప్తంగా 16 అర్జీలు వచ్చాయి. లోవోల్టేజ్ సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవటం లేదని నర్సీపట్నం మున్సిపాలిటీ కాపువీధి వాసులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. సమస్యను వెంటనే పునరుద్ధరించాలని ఆర్డీవో ఏఈని ఆదేశించారు. సాగుభూమికి హక్కు కల్పించాలని కోరుతూ రావికమతంకు చెందిన రాజుబాబు అర్జీ పెట్టుకున్నారు. మున్సిపాలిటీ డాన్‌బాస్కో స్కూల్‌కు సమీప ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని, చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంతం వారు విన్నవించుకున్నారు. నాతవరం మండలం చెర్లోపాలెంలో తన భూమికి పట్టాదారు పుస్తకాలు మంజూరు చేయాలని ఎం.సూరి దరఖాస్తు చేసుకున్నాడు. స్పందనలో ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

పొదుగువాపు వ్యాధికి సకాలంలో వైద్యం

కె.కోటపాడు: పాలిచ్చే పశువులకు పొదుగువాపు వ్యాధి సోకకుండా పశువైద్యాధికారులు, సిబ్బంది ఇచ్చే సూచనలను పాటించాలని కె.కోటపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి తెలిపారు. పశు విజ్ఞాన బడిలో భాగంగా సోమవారం సింగన్నదొరపాలెంలో పాడి రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు పొదుగువాపు వ్యాధి సోకే పశువుల నుంచి పాల దిగుబడి తగ్గుతుందన్నారు. తద్వారా నీరసించే పరిస్థితి ఉంటుందని తెలిపారు. పశువులు ఉండే ప్రాంతాలు పరిశుభ్రత లేని సమయాల్లో ఇటువంటి పొదుగువాపు వ్యాధి సోకే పరిస్థితి ఉంటుందని తెలిపారు. పశువులు ఈ వ్యాధి బారినపడితే వెంటనే పశువైద్యం చేయాలని సూచించారు. పశువులు ఉండే పరిసరాల్లో కాల్షియం పౌడర్‌ను వేయడంతోపాటు ఆయా ప్రాంతం పొడిగా ఉండేలా జాగ్రత్తలను పాటించాలన్నారు. పశువైద్య సహాయకుడు బుచ్చిబాబు పాల్గొన్నారు.


సింగన్నదొరపాలెంలో పాడి రైతులకు సూచనలు చేస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ బైరాగి

సావిత్రిబాయి పూలే ట్రస్టు సేవలు అభినందనీయం

అనకాపల్లిటౌన్: సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని జిల్లా ఖజానా అధికారి(డీటీవో) వి.ఎల్.సుభాషిణి అన్నారు. స్థానిక సుంకరమెట్ట కూడలి యల్లపు ఉమామహేశ్వరి గృహావరణలో సోమవారం రాత్రి శరీర, అవయవ దాతల సంఘం వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరణించినా.. జీవించండి అనే నినాదాన్ని అందిపుచ్చుకుని అవయదానానికి ముందుకు వచ్చినవారిని కొనియాడారు. కొప్పాక గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక హోం నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించిన ఉమామహేశ్వరిని సత్కరించారు.

మెయిన్‌రోడ్డు విస్తరణకు మోకాలడ్డు


సమావేశంలో వ్యాపారులు, ఇరుపార్టీల నాయకులు

రావికమతం: కొత్తకోటలో మెయిన్ రోడ్డు విస్తరణకు కొంతమంది మోకాలడ్డుతున్నారు. ఇక్కడ ఎదురెదురుగా రెండు వాహనాలొస్తే ముందుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రహదారిని తొలుత వందడుగులకు, ఆపై 80 అడుగుల మేర విస్తరించాలని అందరూ నిర్ణయించారు. వ్యాపారులు సైతం సంసిద్ధత వ్యక్తం చేయడంతో సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. ఇంతలో కొంతమంది వ్యాపారులు, భవన యజమానులు, రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తేవడంతో మధ్యలోనే పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ లోవరాజు ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం వ్యాపారులు, భవన యజమానులు, ఇరు పార్టీల నాయకులు సమావేశమయ్యారు. రహదారికి ఇరువైపులా 30 అడుగుల చొప్పున చేపట్టాలని కొంతమంది పట్టు బట్టారు. ఆర్అండ్‌బీ అధికారులు వందడుగుల మేర మార్కింగ్ చేస్తామంటున్నారని, కనీసం 80 అడుగులకు అంగీకరించాలని సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్ దేవ కోరారు. దీనిపై ఏకాభిప్రాయానికి రాకపోవడంతో మంగళవారం మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు గుమ్ముడు దొరబాబు, అడ్డూరి నాగభూషణం, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో ట్రైనీ కలెక్టర్

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో హేమంత్‌తో కలిసి ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు తీసుకెళ్లేందుకు తయారు చేయించిన సంచులను ఆయనకు డీఎంహెచ్‌వో చూపించారు. సంచుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనీ కలెక్టర్ వెంట వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–కేవైసీ నమోదుకు నేటితో ముగియనున్న గడువు


దేవరాపల్లిలో ఈ–కేవైసీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: పంటల నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. దేవరాపల్లి, మామిడిపల్లి, తెనుగుపూడి గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి ఈ– కేవైసీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల నమోదు చేసుకున్న రైతులు ఈ–కేవైసీ చేసుకునేందుకు మంగళవారంతో గడువు ముగుస్తుందని, దీనిని రైతులు గమనించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. సమీప రైతు భరోసా కేంద్రానికి ఆధార్‌కార్డు తీసుకెళ్లి ఈ– కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ– కేవైసీ చేయించుకోకపోతే ధాన్యం విక్రయించే అవకాశం ఉండదన్నారు. పంటల బీమా పరిహారం, పంట నష్ట రుణాలు, సున్నా వడ్డీ పంట రుణాలు, తదితర పథకాలకు అర్హత కోల్పోతారని సూచించారు. ఈమె వెంట మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్ ఉన్నారు.

ప్రతి గ్రామం ఆదర్శమే లక్ష్యం

వెలుగు ఏపీఎం సాధన

రోలుగుంట: ప్రతి గ్రామం ఆదర్శంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో వైద్య, అంగన్‌వాడీ వర్కర్లతోపాటు గ్రామ సంఘ అధ్యక్షులను భాగస్వాములను చేసినట్లు వెలుగు ఏపీఎం కె.సాధన తెలిపారు. అందుకోసం మండలంలో ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులకు వెలుగు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు శిక్షణ తరగతులను స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా సామాజిక కార్యకర్తలు పద్మ, భవాని ఆదర్శ గ్రామాలకు కావాల్సిన అంశాలపై గ్రామ వీధులను, పరిసరాలను గృహ యజమానులతో పరిశుభ్రం చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు తీసుకుంటున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వారు నేర్చుకున్న విషయాన్ని గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రశ్నల ద్వారా తెలుసుకున్నారు.


శిక్షణ ఇస్తున్న వెలుగు ఏపీఎం సాధన

వంట పాత్రల నాణ్యత పరిశీలన


వంట పాత్రల నాణ్యతను పరిశీలిస్తున్న మండల కమిటీ


వంట పాత్రలను పరిశీలిస్తున్న దేవరాపల్లి ఎంఈవో–1 పడాల్‌దాస్

చోడవరం రూరల్: జగనన్న గోరుముద్ద పథకం అమలులో భాగంగా ఆయా పాఠశాలల్లో వంటావార్పు చేయడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వంట పాత్రలను సమకూర్చింది. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యానుసారం వివిధ కేటగిరీలుగా విభజించి వంటపాత్రలు, హస్తాలు, కురిపీలు, గరిటెలు, స్టీల్ బేసిన్లు, మూతలు కేటాయించారు. ఏ, బీ కేటగిరీ పాఠశాల కిట్లలో ఐదేసి, సీ, డీ కేటగిరీలలో ఆరు, ఈ, ఎఫ్ కేటగిరీలలో 11 వస్తువులను కేటాయించారు. వీటితోపాటు వంటపాత్రల బరువు, నాణ్యతా ప్రమాణాలను బేరీజు వేయడానికి మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం ఆయా పాఠశాలల వారీగా కేటాయించిన పాత్రలు, వాటి ప్రమాణాలను మండల కమిటీ పరీక్షించింది. పరిశీలక కమిటీ సభ్యులు, మండల విద్యాశాఖాధికారులు జయలక్ష్మి, సింహాచలం, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి, మండల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మి, సింహాచలం నాయుడులతోపాటు సీఆర్పీ కె.వి.ఎం.నాయుడు, శిరీష, నాగలక్ష్మి, రవి పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేసిందని ఎంఈవోలు బి.పడాల్‌దాస్, వి.ఉషారాణి తెలిపారు. ఈ మేరకు మండల విద్యా శాఖ కార్యాలయానికి కిట్ల రూపంలో వచ్చిన వంట పాత్రలను సోమవారం వారు పరిశీలించారు. మండలంలోని 58 పాఠశాలలకు గాను మధ్యాహ్నం భోజనం తయారీ చేసేందుకు గాను వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. పాఠశాలల వారీగా వీటిని ఆయా ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామన్నారు. దేవరాపల్లి ఎంపీపీ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాసనాయుడు, ఉపాధ్యాయుడు ఎ.కె.ఎస్. నాయుడు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.